క్లుప్తంగా

ప్రజా సమస్యలకు పరిష్కారం



మంగళగిరి: సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీం బాషా కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

మంగళగిరి: మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ ఆలీం బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు 6 కళాశాలల్లో ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేసి, సచివాలయ సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు. మంగళవారం నుంచి 28వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త పేట నిర్మల కళాశాల, వడ్లపూడి చైతన్య స్కూలు, టిప్పర్ల బజార్ నారాయణ స్కూలు, పెదవడ్లపూడి విజేత స్కూలులో 17, 18, 19, 20, 26, 27, 28వ తేదీలు, వడ్డేశ్వరం జెడ్పీ హైస్కూల్లో 17, 18, 19, పెనుమాక జెడ్పీలో 20, 26, అరవింద హైస్కూలులో 27, 28, మహానాడు సింధు నికేతన్, ఉండవల్లి హైస్కూలులో 17న, తాడేపల్లి జెడ్పీ హైస్కూలులో 18, 19, మహానాడు శ్రీ ప్రతిభ హైస్కూలులో 20, 26, నులకపేట సచివాలయంలో 27, 28న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: పట్టణంలోని మ్యాన్‌హోల్స్‌లో ఉన్న వ్యర్థాలను తొలగించి మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి ఆదేశించారు. పట్టణంలోని 35వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్ల పక్కన ఉన్న వ్యర్థాలను తొలగించేవిధంగా చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై అవగాహన



తెనాలిఅర్బన్: క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులందరూ అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్‌కు చెందిన క్లినాక్సీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు వి.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో క్లినికల్ రిసెర్చ్ అండ్ క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్, సాఫ్ట్‌వేర్ టూల్స్‌పై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిపై అవగాహన కలిగి ఉండటం వలన వృత్తిపరమైన నైపుణ్యం లభిస్తుందని చెప్పారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటరమణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాజేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ అంజాద్ ఆలీ, హెచ్‌ఓడీ డాక్టర్ జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



తెనాలిఅర్బన్: లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, ఆయన మానవులను పవిత్రులుగా మార్చేందుకు భూలోకానికి వచ్చారని సండే స్కూల్‌టీచర్ పిల్లి ప్రేమరాజు పేర్కొన్నారు. చినరావూరులోని ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చిలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నపిల్లలకు బైబిల్ క్విజ్, డ్రాయింగ్, పాటల పోటీలు, కంఠత వాక్యాలు వంటి పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి క్రిస్మస్ పండుగ రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. సండేస్కూల్ టీచర్ దీనమ్మ, చిన్నారులు, వారి తల్లిదండ్రులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గోదాదేవి అమ్మవారికి ధనుర్మాస పూజలు



గోదాదేవి అమ్మవారు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు రాజేంద్రశర్మ

మంగళగిరి: పట్టణంలోని పోలేరమ్మ గుడి వీధిలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని యతిరాజ సేవా మండలి ఆధ్వర్యంలో సోమవారం ధనుర్మాస వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ స్వామి, గోదాదేవి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవాచార్యులు పూజలు నిర్వహించారు. సేవా మండలి ప్రతినిధులు డోగిపర్తి లక్ష్మీ భగవతి సుందరి, లక్ష్మీ అంజన, పద్మావతి, మాణిక్యం, లక్ష్మీపద్మజ,సత్యవతి, రత్న, డోకిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ధనుర్మాస పూజలు

ఫిరంగిపురం: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని మొదటిరోజు మండల కేంద్రంలోని గీతా మందిరంలో గోదాదేవి సహిత రంగనాథస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు అర్చకులు వి.రాజేంద్రశర్మ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, అష్టోత్తర, సహస్ర నామాలతో పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం, గీతాభజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామాలు, పాశురాలు గానం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ డి.నరేంద్రకుమార్, కె. వెంకటేశ్వర్లు, జి. మధుసూధన్‌రావులు పర్యవేక్షించారు.

ముగిసిన రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలు



విజేత జట్లతో ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం: నైతిక స్థైర్యం, పట్టుదలతో గెలుపును సాధించవచ్చని ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల ఆట స్థలంలో రెండు రోజులుగా పల్నాడు రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రగ్బీ ఆటల పోటీలు సోమవారంతో ముగిసాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. గెలుపొందినవారిని అభినందించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కర్నూలు జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం సంపాదించగా, ప్రకాశం, నెల్లూరు జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. బాలికల విభాగంలో సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించింది. తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.కృష్ణారెడ్డి, రామాంజనేయులు, కార్డ్ సంస్థ ఫౌండర్ డాక్టర్ ఎం.స్వర్ణ లతాదేవి, డాక్టర్ రంజన్ బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కె.మేరి, ప్రిన్సిపల్స్ ఎండి.సుదర్శన్, డి.జీవన్‌మణి, టి.అమర్‌నాథ్, మండవ. నరసింహారావు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దహనం



నకలు పత్రాలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల నకలు పత్రాలను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ప్రజల్ని మోసం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఆరు నెలల్లో రూ.15,486 కోట్ల విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై భారం వేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, ఎం.నరసింహారావు, అచ్చియ్య, మధుసూదన్ రావు, ప్రమీల, నాగార్జున, వెంకటగిరి, చిన్నోడు, అశోక్ పాల్గొన్నారు.

మేడికొండూరు: పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా విద్యుత్ బిల్లులను సోమవారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు దహనం చేశారు. పార్టీ మండల కార్యదర్శి బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే ట్రూ అప్, సర్దుబాటు, అదనపు చార్జీల పేర్లతో రూ. 16 వేల కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు.

రాబోయే కాలంలో టీడీపీ వైఖరిని నిరశిస్తూ విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు ఆందోళన బాట పట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలి



శిబిరంలో కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు ఎం. శివ కుమారి, వేముల దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, ఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె.కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు కంచర్ల కాశయ్య ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించినట్లయితే వందలాది కుటుంబాలకు మేలు చేసినట్లు అవుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో చొరవ చూపించి, సమస్య పరిష్కరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెల్, ఎస్కే సుభాని, డి. నాగేశ్వరరావు, టి. దుర్గాభవాని, గురవయ్య, డి. నాగమల్లేశ్వరి, శారమ్మ, రమాదేవి, బి.అంకయ్య, ఆశీర్వాదం పాల్గొన్నారు.

పూలే స్మృతి వనాన్ని నిర్మించాలి

మంగళగిరి: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదుట 10 ఎకరాల్లో రూ.10 కోట్ల వ్యయంతో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయిల స్మృతి వనాన్ని నిర్మించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలో సివిల్స్ కోచింగ్ సెంటర్‌తో పాటు అన్ని రకాల పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. 26 జిల్లాల్లో బీసీ స్టడీ సర్కిళ్లు, బీసీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచాలని తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తాడికొండ: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని చైల్డ్ రైట్స్ అండ్ అడ్వకేట్ క్రాఫ్ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకట్ అన్నారు. గరికపాడు గ్రామంలో జరిగిన 'బాల్య వివాహాల అనర్థాలు – చర్యలు' ప్రచార ఉద్యమ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలుగకుండా వారి కలలు సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వివాహ వయస్సు ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహాలు చేస్తే రూ.2 లక్షల జరిమానా, జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, మహిళలపై దాడులు జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీసు హెల్ప్ లైన్ 100, ఉమెన్స్ హెల్ప్ లైన్ 181కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సింగ్ శకుంతల, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, క్రాఫ్ సంస్థ సిబ్బంది జయరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్స్ అసోషియేషన్ సమావేశం

మంగళగిరి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఇందిరా కళా మందిరంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోషియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు అసోషియేషన్ అధ్యక్షుడు పి.గోపిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అసోషియేషన్ ప్రతినిధులు సభ్యులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

మరమ్మతులకే పరిమితం..

నూతన వంతెన లేనట్లేనా?

రేవేంద్రపాడు బ్రిడ్జికి మరమ్మతులు



రేవేంద్రపాడు బ్రిడ్జికి ఏర్పాటు చేస్తున్న ఐరన్ గడ్డర్లు

తాడేపల్లిరూరల్ : బకింగ్ హమ్ కెనాల్‌పై రేవేంద్రపాడు వద్ద ఉన్న బ్రిడ్జికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఈ బ్రిడ్జి కొన్ని సంవత్సరాల నుంచి శిథిలావస్థకు చేరింది. కొత్త బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని ప్రజలు, ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ఈ లోపే కార్పొరేషన్ నుంచి రూ.15 లక్షల నిధులు కేటాయించి, సైడ్ రైలింగ్ నిర్మాణాన్ని ఐరన్ గడ్డర్లతో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు కొత్త బ్రిడ్జి నిర్మాణం ఉందా లేదా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి, రామ చంద్రాపురం, తాడేపల్లి మండల పరిధిలోని చిర్రావూరు, మెల్లెంపూడి, వడ్డేశ్వరం ప్రజలు మంగళగిరి వెళ్లాలంటే ఇదే రహదారిని ఉపయోగిస్తారు. కొత్త బ్రిడ్జిపై ఆశలు పెట్టుకున్న వారికి నిరాశే ఎదురైంది.

నిలిచిపోయిన గణిత పరీక్ష

– పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇతర సబ్జెక్ట్‌ల ప్రశ్న పత్రాలు



తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్న పత్రాల పెట్టెలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ, దుగ్గిరాల మండలంలో జరుగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లోని ఎస్ఏ–1 పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలను విద్యాశాఖ అధికారులు భద్రపరిచారు. సోమవారం జరగాల్సిన గణిత పరీక్షను కూడా తాత్కాలికంగా వాయిదా వేశారు. గణిత పరీక్ష పత్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు యూట్యూబ్‌లో పెట్టడంతో పరీక్షలను అర్ధంతరంగా నిలిపివేశారు. ప్రశ్న పత్రాలను విద్యార్థుల నుంచి తీసివేసుకున్నారు. జరగాల్సిన సబ్జెక్టుల ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు విద్యాశాఖ అధికారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి,ప్రశ్న పత్రాలు తీసుకువెళ్లి ఆయా పాఠశాలల్లో అందించాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల సమయం సరిపోదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వనరులను పొదుపుగా వాడుకోవాలి



ర్యాలీగా వెళుతున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

తెనాలిరూరల్: పొదుపుగా వాడుకోకపోతే భావితరాల వారికి వనరులు ఉండవనే దృక్పథంతో ఎప్పటిలాగానే విద్యుత్ పొదుపుపై విద్యుత్ శాఖ ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెనాలి విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి తెలిపారు. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో డివిజన్ కార్యాలయం నుంచి చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం వరకు సోమవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తద్వారా దేశ ప్రగతికి తోడ్పడాలని డీఈఈ చిరంజీవి అన్నారు. విచ్చలవిడిగా బొగ్గుని వివిధ రంగాలకు వాడటంతో ఇప్పటికే బొగ్గు వనరులు తగ్గాయని అలాగే డ్యాంలో వాటర్ సోర్స్ లేక విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతోందని గుర్తు చేశారు. ముఖ్యంగా విద్యుత్ వాడకంలో పొదుపు పాటించాలని డీఈఈ కోరారు. ఏడీఈ బి. అశోక్ కుమార్, ఏఈలు పీవీ సుధీర్, లక్ష్మీనారాయణ, ఏఏఓ లీలావతి, ఉద్యోగులు కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై పెట్రోల్ పోసిన ఘటనపై కేసు

లక్ష్మీపురం: ఓ మహిళ ఆర్థిక అవసరాలకు డబ్బు అప్పుగా ఇచ్చి తిరిగి అడిగేందుకు ఇంటికి వెళ్లడంతో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పు అంటించి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఎన్.టి.ఆర్. కాలనీకి చెందిన జరుపల ప్రమీల అనే మహిళ ముత్యాలరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మికి లక్ష రూపాయాలు ఆర్థిక అవసరాలకు అప్పుగా ఇచ్చింది. చాలా కాలంగా అదిగో ఇదిగో అంటున్న క్రమంలో ప్రమీల సోమవారం ముత్యాలరెడ్డి నగర్‌లో ఉంటున్న లక్ష్మి ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరింది. దీంతో లక్ష్మి, ఆమెతో పాటు ఉన్న నాగేశ్వరరావుతో కలసి మా ఇంటికి వచ్చి డబ్బులు అడుగుతావా అని ప్రమీలపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

పలు కేసుల్లో నిందితుడిగా ఉంటూ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న వ్యక్తితో పాటు మరొకరు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు అదుపులో తీసుకుని కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ చిలకా రాజకుమార్, డొంకరోడ్డు ప్రాంతానికి చెందిన కొత్తపు రత్నంరాజు అనే వారు ఆ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులకు సమాచారం వచ్చింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిద్దరిని అదుపులో తీసుకుని వీరి వద్ద ఉన్న 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

తవ్వారు.. వదిలేశారు!



కీలకమైన రహదారి...అందులోనూ రెండు పంట కాల్వలపై గల వంతెనల మధ్య సిమెంటు రోడ్డు... సగానికి పగులగొట్టి వదిలేశారు. పది రోజులు పైగా అయ్యింది. భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ సంగతటుంచి, తెలియకుండా వచ్చే ద్విచక్ర వాహనాలు బోల్తా కొడుతున్నాయి. నడి రోడ్డులో తవ్వేసిన రాళ్లు ప్రమాదాలకు ఆస్కారమిస్తున్నాయి. పట్టణంలో పడమర, నిజాంపట్నం కాల్వలపై గల వంతెనల మధ్య రోడ్డు దుస్థితి ఇది. ఇకనైనా అక్కడి వరకు పూడ్చించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు స్థానికులు – తెనాలి

వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: భర్త వేధింపులతో ఈనెల 8వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కొబాల్ట్‌పేట 3వ లైన్‌కు చెందిన ఆరేపల్లి మాధవి(26) తల్లి దండ్రులు మృతి చెందినప్పటి నుంచి అమ్మమ్మ మరియమ్మ వద్దనే ఉంటుంది. 2013లో ఆరేపల్లి ఈశ్వరబాబుతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. వీరువురికి ఇద్దరు మగ సంతానం ఉన్నారు. భర్త చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆరేపల్లి మాధవిని నిత్యం మద్యం తాగి వేధిస్తూ నివాస గృహంలో ఉన్న వస్తువులు కూడా అమ్ముకున్నాడు. దీంతో మాధవి భర్త వేధింపులు భరించలేక ఈనెల 8వ తేదీన పట్టాభిపురంలోని ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీంతో స్థానికులు గమనించి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మాధవి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో పోలీసులకు సమాచారం రావడంతో మృతురాలి వివరాలు సేకరించారు. మృతురాలి సోదరి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త ఆరేపల్లి ఈశ్వరబాబుపై కేసు నమోదు చేశారు.

తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం తిరుప్పావై పై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం గోదా అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ రకాల ఫలరసాలతో, పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కె.వి.రంగనాయకి తిరుప్పావై పై ప్రవచనం చేశారు. ధనుర్మాస విశిష్టత, కాత్యాయిని వ్రతం విశిష్టత, గోదాదేవి అమ్మవారి ఆవిర్భావం తదితర వాటిపై వివరించారు.

పచ్చదనం.. పరిశుభ్రతకు ప్రాధాన్యం



పొన్నూరు: మండలంలోని గ్రామాల్లో పచ్చదనం.. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణ ఆవశ్యకతపై మండల స్థాయి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆరోగ్యం, సమృద్ధిగా నీరు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, విస్తరణాధికారి కేఎస్ మల్లికార్జునరావు, ఏఓ డి.డి.వి.నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు, సీడీపీఓ వెంకటరమణ, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ఓ వేణు, కార్యదర్శులు పాల్గొన్నారు.